www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 జనవరి 2025 | 5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి రామచంద్రపురం



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అరుణ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ద్రాక్షారామ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ కొత్త పల్లి అరుణ దుస్తులను, సబ్బులు, నూనెలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర చాలా గొప్పదన్నారు. వ్యాధులు ప్రబలకుండా నిరంతరం సేవలందిస్తున్న కార్మికులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పెట్టా సత్య నారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బరుల ఏర్పాటులో పోటాపోటీ

- వేర్వేరుగా సిద్ధం చేస్తున్న జనసేన, టిడిపి నాయకులు
- ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నం

సామర్లకోట మండలం పనసపాడులో సిద్ధమవుతున్న భారీ బరి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ ఏడాది కూడా కోడిపందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నేపథ్యంలో కోడిపందేల్లో పైచేయి సాధించేందుకు జనసేన, టిడిపి నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేరువేరుగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లలో ఈ రెండు పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల హెచ్చరికలను పక్కన బెట్టి కూటమి నేతలు బరుల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం, కాకినాడ జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, తొండంగి, కరప, కాజులూరు, కాకినాడ రూరల్, కోనసీమ జిల్లాలో మండపేట, ద్వారపూడి, అంబాజీపేట, రాజోలు, మలికిపురం, మామిడికుదురు, అయినవిల్లి, పి.గన్నవరం, కొత్తపేట, అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, రామచంద్రపురం మండలాల్లో ఏటా కోడి పందేలు భారీగా జరుగుతాయి.

పోటాపోటీగా ఏర్పాట్లు

ఈ ఏడాది కూడా భోగి పండగ నుంచి మూడు రోజుల పాటు కోడి పందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు సాగిస్తున్నారు. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 బరుల్లో పందేలు జరగ్గా దాదాపు రూ.250 కోట్లు చేతులు మారాయి. ఈ సారి కూటమి నేతలు సంక్రాంతి పండుగను క్యాష్ చేసుకోవడానికి కొన్ని రోజులుగా ప్రణాళికలు వేస్తున్నారు. దీంతో బరుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన నాయకులు వేర్వేరుగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల జనవరి ఒకటిన నూతన సంవత్సర వేడుకల్లో టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ కోడి పందేలను నిర్వహించి కొత్త సంప్రదాయానికి తెర లేపారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి కొత్త సంవత్సరం కావడంతో తమ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపే కార్యక్రమం పేరుతో పందేలు ప్రారంభించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తామే బరులను ఏర్పాటు చేస్తామంటూ జనసేన కార్యకర్తలు చెబుతున్నార. పిఠాపురం పట్టణంలో స్థానిక వైఎస్ఆర్ గార్డెన్‌లో టిడిపి, జనసేన వేర్వేరుగా బరుల ఏర్పాటుకు పనులు సాగిస్తున్నారు. అలాగే నిమ్మకాయల నరాజప్ప ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దాపురంలోనూ రెండు పార్టీల నేతలు పోటాపోటీగా పందేల నిర్వహణకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సామర్లకోట మండలం వికె.రాయపురం, మేడపాడు, చంద్రంపాలెం, ఉండూరు, మాధవపట్నం తదితర గ్రామాల్లో వేర్వేరుగా బరులు సిద్ధం చేస్తున్నారు. జనసేన ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ రూరల్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికే ఆయన నియోజకవర్గలో కొత్తూరు, పెనుమర్తి, వలసపాకల, తిమ్మాపురం, రమణయ్యపేట, గైగోలపాడుల్లో బరుల కోసం స్థలాలను సిద్ధం చేశారు. రాజోలు నియోజకవర్గం లాంటి కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులతో పాటు వైసిపి నాయకులు సైతం కుమ్మక్కై బరులను ఏర్పాటు చేస్తున్నారు.

వికె.రాయపురంలో బరి వద్ద జనసేన బృందాలతో కార్యకర్తలు

మందు, విందులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటవుతున్న బరుల వద్ద మందు, విందుకు సైతం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి నిర్వహణ కోసం కొన్ని బరుల వద్ద ఇప్పటికే వేలం నిర్వహించనట్టు సమాచారం. భారీ బరువల వద్ద వేలం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఖరారైనట్టు సమాచారం. అక్కడ మద్యంతో పాటూ బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలు, సిగరెట్లు, కూల్ డ్రింక్స్ వంటివి అమ్ముకునేలా వేలాలు ఖరారు చేశారు. అంతేకాకుండా కోస మాంసం చేసేందుకు, అక్కడే వండి పెట్టేందుకు సైతం నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.

హైటెక్ హంగులు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు, కాట్రేనికోన, ఐ.పోలవరం, కాకినాడ జిల్లా తాళ్లరేవు, ముమ్మిడివరంలో భారీ బరుల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మూడు రోజుల పాటు 24 గంటల పాటు పందేలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా విఐపి గేలరీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పందెం అందరికీ కనపడేలా ఎల్ఇడి స్క్రీన్లను సైతం ఏర్పాట్లు చేసేలా నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. ఆత్రేయపురం, రావులపాలెం, రాయవరం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో పందేలు కూర్చొని చూసేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తప్పు చేస్తే క్షమించేది లేదు

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

సభలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

తప్పు చేస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. శుక్రవారం ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజక వర్గంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భగా పిఠాపురంలోని రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన పల్లెపండుగ వారోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాట ఘటన బాధాకర మన్నారు. దీనికిపై టిటిడి ఇఒ, పాలకమండలి క్షమాపణ చెప్పాలన్నారు. గత పాలకులు రంగులు వేసి అదే అభివృద్ధి అన్నారని విమర్శించారు. తమ హయాంలో గ్రామ సభలు నిర్వహించి రికార్డ్ స్థాయిలో రూ.4500 కోట్ల పనులకు అనుమతి తెచ్చామని గుర్తు చేశారు. పిఠాపురం నియోకవర్గానికి జాతీయ స్థాయిలో పేరు వచ్చేలా అభివృద్ధి చేస్తానన్నారు. తాను పనిచేస్తేనే తరువాత ఎన్నికల్లో గెలిపించాలని లేకుంటే ఓటు వేయొద్దని ప్రజలకు సూచించారు. ఇటీవల కాకినాడ జిల్లాలో క్రైం రేటు పెరిగిందన్నారు. పోలీసులు ఉదాసీనత వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈవ్‌టీజింగ్ చేసే వారికి ఉపేక్షించరాదన్నారు. పిఠాపురంలో మరోమారు ఈవ్‌టీజింగ్ మాట వినపడదన్నారు. పోలీస్ స్టేషన్లలో విఐపి ట్రీట్‌మెంట్లకు స్వస్తి చెప్పాలని పోలీసులకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో లాయర్లతో సెటిల్ మెంట్లు పెట్టకండి అంటూ పోలీసులకు హితవు పలికారు. ప్రతి గ్రామంలోనూ త్వరలో పర్యటిస్తానన్నారు. రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడిని ఇచ్చిన మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

6 నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 12,500 మినీ గోకులం షెడ్లను నిర్మించామని తెలిపారు. కుమారపురంలో రూ.1.85 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. పాడి రైతులకు అందిస్తున్న సదుపాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను, పిఠాపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పోస్టర్‌ను పరిశీలించారు. పిఠాపురం పట్టణంలోని ఒబిఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ స్టాల్లో పందెం పుంజు, మేకలతో పాటు పుంగనూరు ఆవు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అటవీ శాఖ స్టాల్లో ఆలివ్ రిడ్లీ తాబేలుతో పాటు వివిధ రకాల పక్షుల నమూనాలను తిలకించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణాలకు కారణాలపై ఆరా తీశారు.

అడుగడుగున ఆంక్షలే... వెనుదిరిగిన కూటమి నేతలు

పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు పెట్టారు. దీంతో ప్రజలతో పాటు కూటమి నాయకులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. ఎక్కడికి అక్కడ భారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించడంతో సామాన్య ప్రజలతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులును ఎదుర్కోవాల్సి వచ్చింది. సభ వేదిక వద్దకు వెళ్ళేందుకు జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కింద పడిపోయారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ తన అనుచరులతో సభ ప్రాంగణం ముఖ ద్వారం వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. జెసి రాహుల్ మీనా చేరుకుని వర్మకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. వర్మ తోపాటు కొద్ది మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.కృష్ణంరాజు మరి కొంతమంది బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కృష్ణంరాజును మాత్రమే లోనికి అనుమతించారు. దీంతో మిగిలిన వారు అక్కడ నుంచి వెనుదిరిగారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్

మున్సిపల్ కార్మికుల ఒక రోజు దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఒక రోజు రిలే దీక్ష చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్, టైమ్ స్కేల్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులైజ్ చేయాలనే తదితర హామీలు అమలుచేయాలని ముమ్మిడివరం నగర పంచాయతి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు(సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఒక రోజు రిలే దీక్ష చేపట్టారు. ఈ రిలే దీక్షకు సిఐటియు నాయకులు మద్దతుగా తెలిపారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని గతంలో 17 రోజుల సమ్మె లో భాగంగా చేసుకున్న ఒప్పందం మేరకు ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను ఇప్పటికి అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ దీక్ష చేశారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి జీతాలు పెంచాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఐదేళ్ల పూర్తి అయినా ప్రతీ కార్మికుడిని రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నక్కా అరుణ్ కుమార్, గుత్తుల రమేష్ , వంటపాటి వెంకటేశ్వర్లు, యల్లమెల్లి వెంకటరమణ, కె.వెంకటశివ, కె.ఈశ్వర్, కె.జార్జి, జె.సురేష్, కె.శరత్, ఎస్.అజయ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విలసవిల్లిలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళ దేవి

గ్రామంలో ప్రజా ప్రయోజనాల నిమిత్తం రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు సర్పంచ్ సలాది ఊర్మిళదేవి తెలిపారు. విలసవిల్లి జగనన్న కాలనీలో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శుక్రవారం సర్పంచ్ ఊర్మిళదేవి శంకుస్థాపన చేశారు. దశలవారీగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి, గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయనున్నట్టు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమ ంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పుత్సల ఏసు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల షెడ్లు ప్రారంభం

శివలలో మినీ గోకులం షెడ్డు ప్రారంభించిన మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలు చోట్ల ఉపాధి హామీ చట్టం నిధుల ద్వారా నిర్మించిన మినీ గోకులాల షెడ్లను శుక్రవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

కె.గంగవరం: మండలం లోని శివల గ్రామంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం నిధుల ద్వారా నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశుపోషణకు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిధుల ద్వారా 90 శాతం రాయితీపై మినీ గోకులాలను నిర్మిస్తోందన్నారు. ఈ పథకంలో భాగంగా 2,4,6 పశువులు కలిగిన రైతులు పశువుల షెడ్లు నిర్మించుకోవాలని. 2 పశువులకు రూ.1 లక్షా15 వేలు, 4 పశువులకు రూ.1లక్షా85వేలు, 6 పశువులకు రూ.2లక్షల 30వేల అంచనా తో 90 రాయితీ ఇస్తుందన్నారు. కేవలం 10 శాతం మాత్రమే రైతులు భరించేలా పశువుల షెడ్లు నిర్మాణం చేసుకోవాలన్నారు. రామచంద్రాపురం నియోజకవర్గం లో రూ. 3,63,49,798ల ఉపాధి హామీ చట్టం నిధులతో 182 పశువుల షెడ్లు మంజూరయ్యాయని వీటి లో ఇప్పటికే 44 పశువుల షెడ్ల నిర్మాణం పూర్తి చేశారని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ మధుసూదన్, ఎంపిపి పంపన నాగమణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జి.సురేష్ బాబు, డాక్టర్ సంయుక్త,, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. **ఆలమూరు:** రైతులకు బాసటగా కూటమి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా పనిచేస్తుందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని బడుగువానిలంకలో ఉపాధి హామీ చట్టం నిధులతో ఎపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోకులం షెడ్డులను ఆయన, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావుతో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ గ్రామంలో మూడు గోకులం షెడ్డులను నిర్మించి ప్రారంభించామన్నారు. అలాగే మండలంలో మొత్తం 49 గోకులాలు మంజూరు చేశామని, అందులో 22 ఇప్పటికే పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని ఈ నెలాఖరులోగా అధికారులు పర్యవేక్షణ లోపం లేకుండా తప్పకుండా పూర్తి చేయాలని వారిని ఆదేశించారు. **మామిడికుదురు:** పశువులు పెంపకాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మినీ గోకులాలు ఏర్పాటు చేస్తోందని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. లూటుకుర్రులో పల్లెపండగ వారోత్సవాలు భాగంగా ఉపాధి హామీ చట్టం నిధులు రూ.లక్షా85వేలు నిధులతో లబ్ధిదారుడు పాలూరి పెద్దిరాజు నిర్మించిన మినీ గోకులాన్ని శుక్రవారం ఎం ఎల్ ఎ ప్రారంభించారు ప్రభుత్వం అందిసున్న సహకారం తో పశు సంపదను వృద్ధి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, జనసేన నాయకులు విల్ల సుబ్బారావు, ఎంపిటిసి సభ్యుడు నామన వెంకటేశ్వర రావు, పెదపట్నం లంక ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య, జాలెం శ్రీనివాస రాజా, తుండూరి బుజ్జి, ఉపాధి హామీ చట్టం ఎపిఎం రమేష్ బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **అయినవిల్లి**: మండలంలో నేదునూరు గ్రామం ఎస్.సావరం లో పల్లెపండుగ వారోత్సవాలులో భాగంగా మొదట విడతగా లబ్ధిదారులకు మంజూరై రూ.2,30,000 వ్యయంతో లబ్ధిదారులు గోకరకొండ అనంతలక్ష్మి నిర్మించిన గోకుల షెడ్డు ను శుక్రవారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గిడ్ల భీమారావు, ఎపిఒ కుమార్ దాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగువానిలంకలో ఎడ్ల బండి నడిపే క్రమంలో ఎంఎల్ఎ సత్యానందరావు

లూటుకుర్రు లో మినీ గోకులం ప్రారంభిస్సున్న ఎంఎల్ఎ గిడ్డి

పిహెచ్‌సికి వైద్య పరికరాల బహూకరణ

ప్రజాశక్తి - అంబాజీపేట

ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవేర్ గ్రూపు పాన్ ఇండియా వారు ఎస్‌బిఐ సహకారంతో సిఎస్ఆర్ యాక్టివిట్స్‌లో భాగంగా అవసరమైన పరికరాలను వైద్యాధికారిణి ఎ.ఇంద్రావతికి శుక్రవారం అందజేశారు. లేబర్ రూమ్ టేబుల్, ఒటి టేబుల్, స్టాండింగ్ బిపి మెషన్, మాన్యువల్ డిజిటల్ బిపి మెషన్ పరికరాలను బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎమ్‌వివిఎమ్.కష్ణ, వారి ప్రతినిధులు ద్వారా అవేర్ గ్రూప్ బ్రాంచి చైర్మన్ మాధవన్ జి, ప్రాజెక్టు డైరెక్టర్ వరుణ్, ప్రతినిధులుగా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ మేనేజర్ అవేర్ గ్రూపు ప్రతినిధులకు వైద్యాధికారిణి ఇంద్రావతి వారి సేవలను అభినందించారు.

కార్టూ'నిజం'

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కలెక్టరేట్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగ

జిల్లాలో పలుచోట్ల సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సంప్రదాయదుస్తులతో సంబరాల్లో పాల్గొన్నారు.

అమలాపురం: సాంస్కృతి, సంప్రదాయాల కలయికే తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి అని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం నందు ముందస్తుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించార. కార్యక్రమ ంలో భోగి మంటలు, రంగవల్లులు, ముగ్గులు వేసి టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా ప్రజలకు ముందస్తుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జెసి టి.నిషాంతి ప్రసంగిస్తూ తెలుగువారు జరుపుకునే ప్రతి పండుగకు ఒక విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. స్థానిక కలెక్టరేట్లో ప్రాంగణంలో సంక్రాంతి శోభ పండుగ ఏర్పాట్లు బాగు న్నాయని కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావును జెసి అభినం దించారు. జెసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులకు ఇబ్బందికి టగ్ ఆఫ్ వార్ పోటీని వారు ప్రారం భించారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో గెలిచిన వారికి మెమెంటో అందజేశారు. కార్యక్రమం లో, సివిల్ సప్లయి డిఎం బాల సరస్వతి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి, డిఎసి మెంబర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు. ఆదిత్య పాఠశాల గొల్లగూడెం నందు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామీణ వాతావరణం తలపించే విధంగా ఆదిత్య ప్రాంగణం రూపుదిద్దుకుంది. దీనిలో భాగంగా చిన్నారులకు భోగి పళ్ళు , విద్యార్థులను గొబ్బెమ్మలు, భోగి మంటలు , పొంగలి వంటకం, బొమ్మల కొలువు , జానపద కళలో భాగంగా సోదెమ్మలు, జంగం దేవరులు, హరిదాసు , కొమ్మదాసరి, గంగి రెద్దులు వాడు, కోలాటం చివరిగా ప్రభ ఊరేగింపుతో కార్యక్రమాన్ని ముగించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు , ఉపాధ్యాయులకు ఆదిత్య సంస్థల చైర్మెన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపల్ కె.లక్ష్మీదేవి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేసారు. కామనగరువు ఆదిత్య పాఠశాల లో ముందుస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి . ప్రిన్సిపాల్ రామప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ ఆదిత్య సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు పాల్గొన్నారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి, ఆదిత్య జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ చలపతిరావు, స్కూల్ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ సుధ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే ముందుగానే సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. **రామచంద్రపురం**: సంక్రాంతి సంబరాలను ద్రాక్షారామం లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోనూ ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ గంగుమళ్ళ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి పల్లె వాతావరణం ప్రతిబింబిస్తుందన్నార. ముందు తరాలకు అందించాలన్నారు. రామచంద్రపురం పట్టణంలో గల మోడరన్ కళాశాలలో రెండు రోజులుగా సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. శుక్రవారం సంక్రాంతి పండుగలో ముఖ్యమైన బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలంకరించిన బొమ్మలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భోగి పళ్లను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లయన్ జివి.రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా వివిఎస్ ఎం.కళాశాలలను పలు ప్రయివేటు పాఠశాలల్లోనూ సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** అంగర శ్రీసిద్ధార్థ కళాశాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నం టాయి. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ డాక్టర్ వి.దివ్యశేఖర్, కరస్పాండెంట్ వి.రాజా, ప్రిన్సిపల్ పి.రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలలో విద్యార్థులు



రామచంద్రపురం 'మోడరన్' లో గొబ్బెమ్మలు బొమ్మల కొలువు



అంగర సిద్ధార్థ కళాశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిలు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పరిధిలో శుక్రవారం 216 (ఎ) నెంబర్ గల జాతీయ రహదారి పక్కన బస్‌షెల్టర్ లో సుమారు 40 సంవత్సరాలు వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. దీంతో చొప్పెల్ల విఆర్ఎ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు. పై వ్యక్తి యొక్క ఆచూకీ తెలిసిన యెడల ఈ కింది నెంబర్లకు సమాచారం ఇవ్వవలసినదిగా కోరారు. ఆలమూరు ఎస్ఐ సెల్ నెంబరు: 9440904849, రావులపాలెం రూరల్ సిఐ సెల్ నెంబరు 9440796527 ను సంప్రదించాలన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - కాట్రేనికోన

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం నడవపల్లి శివాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న మహిళ మెడలో బంగారపు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాలు ఇవి.. నడవపల్లి గ్రామానికి చెందిన దీక్షితుల సీతామహాలక్ష్మి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శివాలయానికి వెళ్లింది. ఆమె తిరిగి వస్తున్న సమయంలో ఆమె మెడలో రెండున్నర కాసుల బంగారపు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. చోరీ పాల్పడిన వ్యక్తి నడవపల్లి వాటర్ ట్యాంకు వైపు వెళ్లిపోయినట్లు బాధితురాలు తెలిపింది. వెంటనే జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేవారు. సంఘటన స్థలానికి చేరుకున విచారణ చేపట్టినట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల శివారున భారత్ పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం జరిగిన లారీ ప్రమాదంలో ఉండి వైష్ణవి(13) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఉండి శ్రీను కుమార్తె పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం గురుకుల పాఠశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో గురువారం తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం నభిపేటలో అమ్మమ్మ యేంట్రపాటి సంతోషం ఇంటికి వచ్చింది. కుమార్తె శుక్రవారం శ్రీను తన బైకుపై ఇంటికి తీసుకెళ్తున్నాడు. పెట్రోల్ బంకు సమీపానికి వచ్చే సరికి వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన శ్రీనును ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నరేంద్రపట్నంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడిపి 333 బెల్లపు ఊట ధ్వంసం దశ్యం

వృద్ధుని అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటకు చెందిన వృద్ధుడు కట్టమూరు రామారావు అదృశ్యంపై సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం సామర్లకోటలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటినుంచి తెలిసిన బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికామని అయినా అతని ఆచూకీ దొరకలేదన్నారు. ఆయనకు అవసరమైన మందులు, సెల్ ఫోన్ ఇంటి వద్దనే వదిలేసినట్లు బంధువులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9492314822, 8522848283 నెంబర్లకు సమాచారం అందించాలని కుమారుడు సత్తిబాబు, కుటుంబ సభ్యులు కోరారు.

హత్య కేసులో అరెస్టు చేసిన నిందితులతో సిఐ, ఎస్ఐ

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో సత్తి సువర్ణరత్నం అనే యువకుడిని హత్య చేసిన కేసులో నిందితుడు మంచాల వెంకట సూర్యరావును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సువర్ణ రత్నం హత్య చేసిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన సూర్యారావు అలియా సురేష్ దుస్తులు డబ్బులు సర్దుకుని హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధం కాగా శుక్రవారం కోటిపల్లి కూళ్ల మధ్య ఏటి గట్టుపై సంచరిస్తున్నాడన్న సమాచారం పై అరెస్టు చేసినట్లు ఇన్చార్జి సిఐ పి.దొర రాజు విలేకరులకు తెలిపారు. స్నేహితుడైన సువర్ణ రత్నం తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు అన్న అనుమానంతో హత్య చేసినట్లు నిందితుడు వెల్లడించాడని సిఐ వివరించారు. పామర్రు లో సువర్ణ రత్నంకు సురేష్ అధికంగా మద్యం తాగించి, తన కూడా తెచ్చుకున్న బ్లేడు తో గొంతుపై కోసేడని అప్పటికి చనిపోకపోవడంతో పంట చేలో బురదలో తొక్కి చంపినట్లు నిందితుడు వివరించినట్లు సిఐ తెలిపారు. నిందితుడిని రామ చంద్రపురం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో పామర్రు ఎస్ఐ జానీ బాషా పాల్గొన్నారు.

మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షత జరిగిన సమావేశం లో మిగులు బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. మొత్తం బడ్జెట్ రూ.12 కోట్లగాను, ఖర్చులు పోను మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు, ఇతర అధికారులు, వైస్ ఛైర్మన్ కొలమూరు శివాజీ, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ పనులు ప్రారంభించేలా చర్యలు

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

కోటిపల్లి - నర్సాపురం రైల్వేలైన్‌లో భాగంగా భూసేకరణ పూర్తయిన ప్రాంతాలలో రైల్వే లైన్ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రైల్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ కు సంబంధించి రైల్వే లైన్ నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ రెవెన్యూ రైల్వే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో రైల్వే లైన్లో భాగంగా భూ సేకరణ పూర్తయిన ప్రాంతాల లోని భూమిని రైల్వే అధికారులు స్వాధీన పరుచుకొని రైల్వే నిర్మాణ పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అయినవిల్లి మండలంలోని శానపల్లి లంక ,సిరిపల్లి, మాగం, అమలాపురం రూరల్ మండలంలోని ఎ.వేమవరం, భట్నవిల్లి గ్రామాలలో రైల్వే లైనుకు సంబం ధించి భూసేకరణ పూర్తయిందని రైల్వే అధికారులు గ్రామానికి ఒక ప్రత్యేక బృందాలను పంపి నిర్మాణ పనులను ప్రారంభిం చాలన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలలో భూసేకరణ పూర్తయిన భూములను సర్వే చేసి హద్దుల ను గుర్తించి రైల్వే అధికారులకు అప్పగించాలన్నారు. సంబంధిత ప్రాంతాలలోని రైతులు తదుపరి పంట వేసేలోపు రైల్వే అధికారులు భూసేకరణ పూర్తయిన భూములను తమ ఆధీనంలోకి తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. రైల్వే లైన్ నిర్మాణం లో భాగంగా భూ సేకరణ విషయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కోనసీమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, దక్షిణ మధ్య రైల్వే, ఉప ముఖ్య ఇంజినీరు ఎ. బద్దియ్య, అమలాపురం, కొత్త పేట రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.మాధవి, శ్రీకర్, గ్రామీణ నీటి సరఫరా కార్యనిర్వాహక ఇంజినీరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత రైల్వే సర్వే అమలు చేయాలని వినతి

మామిడికుదురు: మండల పరిధిలో ఏడు గ్రామాల రైల్వే బాధితులు మండల టిడిపి అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీ గంటి హరీష్ మాదుర్‌కి వినతి పత్రం అందజేశారు కొత్త సర్వే కాకుండా పాత సర్వే ప్రకారం రైల్వే లైన్ మార్చాలని ఎంపీని కోరారు. పత్రం సమర్పించిన వారిలో నగరం గ్రామశాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు, గ్రామ శాఖ టిడిపి అధ్యక్షులు బాధితులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

సంక్రాంతి సంబరాల టీజర్‌ను విడుదల చేస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాం బీచ్‌లో సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు కోరారు.ఎస్.యానాం బీచ్ లో శుక్రవారం సంక్రాంతి సంబరాలలో భాగంగా జబర్దస్త్ టీం టీజర్ ను ఎంఎల్ఎ ఆనందరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే రీతిలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు బీచ్ లో అందరూ మెచ్చే విధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే బీచ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో నాయకులు పలచోళ్ళ పద్మనాభం, లంకే భీమరాజు, గంధం పల్లంరాజు, పినిశెట్టి నరసింహారావు, వాసు రాజు, ఉలిశెట్టి దొరబాబు, అయితాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ షాపింగ్ మాల్ లో వికలాంగులతో మంత్రి సుభాష్

వికలాంగులకు దుస్తుల అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మానసిక వికలాంగులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వారికి కొత్త దుస్తులు అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయి ఆదరణ లేని ముచ్చుమిల్లి రోడ్డులో ఉన్న జోయ్ మినిస్ట్రీస్ బెతెస్త న్యూలైఫ్ సెంటర్ వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులతో కలిసి మంత్రి. ఒక ప్రత్యేక బస్సులో పట్టణంలోని రిలయన్స్ ట్రెండ్స్ షాపింగ్ మాల్ కి వారిని తీసుకొచ్చారు. సుమారు రెండు గంటలకు పైగా తన విలువైన సమయాన్ని వెచ్చించి మానసిక వికలాంగులకు దగ్గరుండి నూతన వస్త్రాలకు కొనిచ్చారు. మంత్రి సుభాష్. వారందరితో మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసుకున్న వికలాంగురాలు ఖండవల్లి దుర్గాదేవికి కాకినాడలోని వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి అక్కడికక్కడే ఉద్యోగం ఏర్పాటు చేశారు. అలాగే వికలాంగ ఆశ్రమ పాఠశాలను నిర్వహిస్తున్న అలెగ్జాండర్, ప్రిస్కిల్లా దంపతులను మంత్రి సుభాష్ అభినందించారు. మొత్తం అందరికీ కొత్త దుస్తులు కొన్న మంత్రి తిరిగి వారిని హాస్టల్కు చేర్పించారు. మంత్రి సుభాష్‌కు వికలాంగులు , హాస్టల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు, తదితరులు

తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకలో ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా రూ.39.60 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్ (వాటర్ ట్యాంక్) నిర్మాణానికి కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ తో విచ్చేసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ఇంటింటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల డిసి అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు పడాల నాగలక్ష్మి అమ్మిరాజు, జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, టిడిపి నేతలు పాలూరి గోవిందరాజు, ఈదల నల్లబాబు, ఒంటిపల్లి సతీష్, ఎంపిడిఒ ఎ.రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ పి.పద్మ, ఎపిఒ అరుణకుమారి, కార్యదర్శి విజయ రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి కిటకిటలాడిన ఆలయాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వెంకన్న, రామాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. అప్పపపల్లి బాల బాలాజీ స్వామిని, వాడపల్లి వెంకన్నను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.



అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని శుక్రవారం పి. గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, జెసి టి.నిషాంతి, పి.గన్నవరం సిఐ ఆర్.భీమరాజు, తహశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్యాచారి తదితరులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చక స్వాములు వీరికి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రాలు వేద ఆశీర్వచనం అందజేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా గోదాదేవికి లక్ష చామంతి పూజ నిర్వహించారు ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో యాత్రికులకు అన్ని సదుపాయాలు సమకూర్చారు. **ఆత్రేయపురం:** ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు శుక్రవారం తెల్లవారుజాము నుండి బారులు తీరారు. ఉత్తర ద్వారం ద్వారా యాత్రికులు స్వామివారిని దర్శించుకునేలా ఆలయ డిసి నల్లం చక్రధర్ రావు ఏర్పాట్లను చేసి పర్యవేక్షించారు. కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిసి నల్లం చక్రధర్ రావు మరియు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెంకన్న ఆలయ మాజీ ఛైర్మన్ నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని రామాలయాల వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రికులతో ఆలయాలు కిక్కిరిసాయి.

పసుపల్లి లో గోకులం షెడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - అంబాజీపేట

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. మహాత్మ గాంధీ ఉపాధి హామీ చట్టంలో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా పసుపల్లిలో మొదటి విడతగా మంజూరైన 19 మంది లబ్ధిదారులకు రూ.35.85 లక్షలను పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ శుక్రవారం అందజేశారు. ఇందులో భాగంగా లబ్ధిదారులు నాగులపల్లి కొండలరావు రూ.1లక్షా 85 వేలు ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోకులాలను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, ఎంపిడిఒ జివి.సరోవరరావు, ఎపిఒ పి.కృష్ణ, కూటమి నాయకులు, అధికారులు, షీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రామచంద్రపురం సిఐగా వెంకటనారాయణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎం.వెంకట నారాయణ

రామచంద్రపురం సిఐగా ఎం.వెంకటనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. అంతకుముందు రామచంద్రపురం సిఐగా పనిచేసిన కడియాల అశోక్ కుమార్ పలు కార్యక్రమాల్లో పాల్గొని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఆయనను విఆర్‌కు బదిలీ చేశారు. అప్పటి నుంచి రామచంద్రపురం సిఐగా మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. సిఐ వెంకటనారాయణ విధులను చేపట్టిన వెంటనే పట్టణ పోలీసులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్

ప్రశాంత వాతావరణంలో ప్రభల తీర్థం నిర్వహించాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ప్రభల తీర్థం నిర్వహించుకోనేందుకు చర్యలు చేపట్టాలని కమిటీ నాయకులకు కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్ సూచించారు. మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన ఆర్‌డిఒ సమక్షంలో సంక్రాంతి సందర్భంగా ప్రబలతీర్థం సంబంధించి శాంతి కమిటీ సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ జోషి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండలంలోని గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డాక్టర్ సదాశివమూర్తికి సత్కారం

ప్రజాశక్తి - అంబాజీపేట

సదాశివమూర్తిని సన్మానిస్తున్న బుల్లియ్య

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం అబ్బిరాజు పాలెం గ్రామానికి చెందిన డాక్టర్ వేదాంతం సదా శివమూర్తి ని పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాలకొల్లు లో చైతన్య ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్ నెలకొల్పి ఎంతో మంది వికలాంగులకు కాళ్లు, చేతులు లేని వారికి కృత్రిమ అవయవాలు తయారు చేస్తూ పేదలకు, పిల్లలకు ఉచితంగా అందజేస్తున్న సదా శివమూర్తి ని ఈ సందర్భంగా బుల్లియ్య అభినందిచారు. బుల్లియ్య మాట్లాడుతూ గతంలో సుగర్ వ్యాధి తో బాధపడుతూ తాను కాలు కోల్పోవడంతో మనో వేదనకు గురయ్యానని సదాశివమూర్తి తనకు ఏర్పాటు చేసిన కృత్రిమ కాలు వల్ల ఈ రోజు అన్ని పనులు స్వతహాగా చేసుకుంటూ బయట తిరగగలుగుతున్నాని ఆనందం వ్యక్తం చేశారు. మూగ జీవులకు కూడా కృత్రిమ కాళ్లు అమర్చి పలువురుచే సదా శివమూర్తి అభినందనలు పొందుతున్నారన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీలలో మండలంలోని మూలస్థానానికి చెందిన పెమ్మడబోయిన సుస్మాంజలి, పెదపల్లకి చెందిన బుంగ అశ్విన్, ఆలమూరు చెందిన చల్లా వీరేంద్రలు గోల్డ్ మెడల్ సాధించారని మదర్ థెరిసా స్పోర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు శుక్రవారం తెలిపారు. ఈనెల 12న విజయవాడలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు వీరు ఎంపికైనట్లు ఆయన తెలిపారన. ఎంపికైన విద్యార్థులను మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ టి.వెంకటలక్ష్మి, టి.ఎల్.సందీప్ కిరణ్, ఎం.సత్య కాంత్, ఆయా గ్రామాల ప్రముఖులు అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి కి చెందిన కామిశెట్టి ఏడుకొండలు ఇటీవలఅనారోగ్యంతో మతి చెందాడు. జనసేన గ్రామ శాఖ ఆధ్వర్యంలో సేకరించిన రూ.54వేలు ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం మతిని భార్య సత్యవతికి అందజేశారు. జనసేన నేతలు తులా బ్రహ్మాజీ, రవణం మణికంఠ ఆధ్వర్యంలో ఈ విరాళాలు సేకరించారు. పవన్ ఆశయాల కనుగుణం గా సేవా కార్యక్రమాల్లో ముందున్న జనసేన నేతలను ఎంఎల్ఎ ఈ సందర్భంగా అభినందించారు



అంగరలో కొండమూరి నరసింహమూర్తి విగ్రహావిష్కరణ

కొండమూరి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గ్రామీణ ప్రజలకు ప్రాణదాత డాక్టర్ కొండమూరి నరసింహామూర్తి సేవలు అభినందనీయమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ప్రముఖ సర్జన్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ సర్జరీ పిండి లక్ష్మణమూర్తి,లు పేర్కొన్నారు. బుధవారం అంగర బస్టాండ్ సెంటర్ సమీపంలో ఆయన శిష్య బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండమూరి నరసింహ మూర్తి విగ్రహావిష్కరణలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ నరసింహామూర్తి పేదలకు వైద్య సేవలు అందించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారన్నారు. ఆయన శిష్య బృందం సుమారు 30 మంది వివిధ ప్రాంతాల్లో స్థిరపడి వైద్య సేవలందిస్తూ ఆర్థిక ంగా స్థిరపడ్డారన్నారు. గురుభక్తిగా ఆయన విగ్రహాన్ని నెలకొల్పడం ప్రశంసనీయమన్నారు డాక్టర్ కొండమూరి కుమారుడు సత్యనారాయణ, అల్లుడు మడకా రాంబాబుతో పాటు వారి కుటుంబమంతా వైద్య వృత్తిలో కొనసాగుతూ ప్రజలకు సేవలు అంది స్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వ రరావు, ఎంపిటిసి సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, ఆర్ఎంపి డాక్టర్ గంగుమళ్ల రాంబాబు, తదితరులు, పాల్గొన్నారు.

పామర్రులో నేత్రదానం

ప్రజాశక్తి కె.గంగవరం

మండలంలోనీ పామర్రు గ్రామంలో తూము వీర వేంకట సత్యారాయణ (80) అనారోగ్యం తో మరణించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంగీకారంతో నేత్ర దానం చేశారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బంది, సత్యనారాయణ కంటి నుండి కార్నియాలను సేకరించారు.

పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ జి.భీమారావు

ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - అయినవిల్లి

మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గిడ్ల భీమారావు సంక్రాంతి సందర్భంగా శుక్రవారం తన సొంత ఖర్చులతో దుస్తులను కార్యాలయ సిబ్బందికి, జూనియర్ అసిస్టెంట్, గౌరీ శంకర్, రాజబాబు, టైపిస్ట్‌లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో తనతో పాటు సిబ్బంది కూడా ఆనందంతో ఉండాలని వారికి దుస్తులు, స్వీట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు . ఎంపిడిఒ కార్యాలయంలో మొదటిసారిగా ఎంపిడిఒ భీమారావు దుస్తులు పంపిణీ చేసినందుకు సిబ్బంది ఎంపీడీవోకు ధన్యవాదములు తెలిపినారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని వీరవల్లి పాలెం గ్రామంలో సుమారు రూ.1 కోటి 39 లక్షల వ్యయంతో నిర్మించబోతున్న రెండు వాటర్ ట్యాంకులు నిర్మాణానికి శుక్రవారం పి గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ భూమిపూజ చేశారు. స్థానిక సర్పంచ్ సలాది బుచ్చిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక జడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు మద్దాల చంటిబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల స్థాయి కిశోర వికాసంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిడిపిఒ ఐ.విమల ఆధ్వర్యంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు, ఎఎన్ఎంలకు, పాఠశాల ఉపాధ్యాయులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేటీ బచావో బేటీ పడావో పథకం, పిల్లలలో న్యూట్రీషన్ స్టేటస్ పురోగతి గురించి అవగాహన కల్పించి పాఠశాలలలో పిల్లల డ్రాప్ అవుట్స్ తగ్గించాలని, బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వివిధ రకాలైన చట్టాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వెంకటాచలం, ఎంపిపి పాలెపు లక్ష్మీ ధర్మారావు, వైస్ ఎంపిపి సానబోయిన నాగేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, స్థానిక సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎల్‌వి.రమణి, కెవివిఎస్.తులసి కుమారి, సిహెచ్.జయ వాణి, ఉపాధ్యాయులు శివ గణేష్, మెడికల్ ఆఫీసర్ లిఖిత, కాట్రేనికోన, పల్లంకుర్రు పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిడిపిఒ తదితరులు

దస్తావేజులు పోయినవి

నేను, **చెట్టే సుభాషిణి,** తండ్రి: చెట్టే సత్తియ్య, ప్రస్తుత నివాసం: శింగవరం, నిడదవోలు మండలం, తూ.గో.జిల్లా ఇందుమలముగా తెలియజేయునది ఏమనగా, నాకు చెందిన **ఇంటి డాక్యుమెంట్ నెం. 5900/2012, తేది. 21-09-2012** గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ **ది. 02-01-2025** తారీఖున నిడదవోలు పట్టణంలో ఐసిఐసిఐ బ్యాంక్ నందు లోన్ నిమిత్తం వెళుతుండగా గణేష్ చౌక్ సెంటర్ నందు ఆటో దిగుతుండుగా పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. నేను చుట్టుప్రక్కల విచారించిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో గాని, నా **సెల్ నెం. 91214 80557** నందు గాని తెలియజేయగలరు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)

I.A. 1502/2016, I.A. 534/2011

Between:

పిటీషనరు (వాది): దేవరపు రాంబాబు, S/o. లేటు వెంకన్న, వయస్సు 58 సం॥లు, వ్యవసాయం, సా॥ ముగ్గళ్ళ, గణపవరం మండలం, ప॥గో॥జిల్లా.

Vs

రెస్పాండెంట్లు (ప్రతివాద్లు):

1. గుంటూరు సామ్రాజ్యం (died)
2. గుంటూరు సత్యనారాయణరెడ్డి
3. గుంటూరు శ్రీనివాసులు రెడ్డి

4వ రెస్పాండెంటు: గుంటూరు తిరుమల రెడ్డి, S/o. సత్యనారాయణరెడ్డి, ప్రైవేటు ఎంప్లాయి, కుమ్మల వీధి, సా॥ నిడదవోలు, నిడదవోలు మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా, రిజిస్టరు పోస్టు ద్వారా నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-01-2025** సం॥రం తేదీ **ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

ఎస్.సుబ్బారావు
కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు
ది.08-01-25 సెల్: 9492917811